ఉద్యాన పంటలకు తెగుళ్లు

- ఆందోళనలో అన్నదాతలు
- పట్టించుకోని ఉద్యాన అధికారి


తెగుళ్లతో ఎండుముఖం పడుతున్న అరటిపంటను చూపుతున్న రైతు

యల్లనూరు: చేతికొచ్చిన పంటలు తెగుళ్లతో కళ్లెదుటే ఎండుతుంటే రైతు గుండె తరుక్కుపోతోంది. ఉద్యాన రైతులకు సకాలంలో అధికారుల సలహాలు, సూచనలు కరువయ్యాయి. దీంతో ఆరుగాలం శ్రమించి కష్టపడి పంటలను సాగు చేస్తే ఆఖరికి తెగుళ్లు సోకి, ఆశించిన దిగుబడులు రాక అయోమయంలో ఉన్నారు. సాగు చేసిన పంటలకు గిట్టుబాటు దరలు లేక అవస్థలు పడుతున్నారు. బ్యాంకుల్లో నగలు తనాఖా పెట్టి పంటలను సాగు చేస్తే ఆఖరికి అన్నీ అప్పులు మిగులున్నాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

ఉద్యాన పంటలకు నిలయం 'యల్లనూరు'

జిల్లాలో యల్లనూరు మండలం ఉద్యాన పంటలకు పెట్టింది పేరు. మండలంలో అరటి 4,008 ఎకరాలు, మామిడి 112 ఎకరాలు, దానిమ్మ 1,250 ఎకరాలు, చీనీ 11,330 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. వేరుశనగ తదితర పంటలతో ఏటా నష్టాలు వస్తుండటంతో రైతులు అరటి, దానిమ్మ, ద్రాక్ష వంటి పంటలను సాగు చేసి లాభాలు గడిస్తున్నారు. మండలంలో చాలా మంచి మంచి రైతులు ఉన్నారు. వారికి సరైన సమయంలో అధికారుల సలహాలు తోడైతే మరిన్ని దిగుబడులు సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచే అవకాశం ఉంది.

గిట్టుబాటు ధరలు లేక అవస్థలు

కష్టపడి అన్నదాతలు పండించిన చీనీ, అరటి, దానిమ్మ పంటలకు గిట్టుబాటు ధరలు లేక అవస్థలు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో మోతుబరి రైతులు ఎక్కువ దిగుబడులు సాధించి తక్కువ ధరలకు విక్రయిస్తూ నష్టపోతున్నారు. ప్రస్తుతం చీనీ ధర పడిపోవడంతో చెట్లమీదనే కాయలను పెట్టుకున్నారు. ధరల కోసం చీనీకాయలు చెట్టు దిగడం లేదు.

పత్తాలేని ఉద్యాన అధికారి

హార్టికల్చర్ అధికారి నెట్టికంటయ్య అందుబాటులో ఉండడం లేదని ఉద్యాన రైతులు ఆరోపిస్తున్నారు. శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి కూడా నెట్టికంటయ్య గైర్హాజరయ్యారు. అలాగే ప్రతి సోమవారం తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించే ఫిర్యాదుల విభాగానికి రారు. యల్లనూరు మండల రైతులకు ఉద్యాన అధికారి దూరంగా ఉంటున్నారు. ఆయన అందుబాటులో ఉంటూ సలహాలు , సూచనలు ఇచ్చి తెగుళ్ల నుంచి పంటలను కాపాడాలని పలువురు రైతులు కోరుతున్నారు.

క్లుప్తంగా

మాదిగల చైతన్య సదస్సు జయప్రదం చేయండి


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు ఈరన్న

గుత్తి: అనంతపురంలో అక్టోబర్ 13న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే మాదిగల చైతన్య సదస్సు జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు ఈరన్న కోరారు. గుత్తిలోని ఆర్అండ్బీ బంగ్లాలో ఆదివారం ఆయన ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి మాట్లాడారు. మాదిగల చైతన్య సదస్సుకు ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, మాదిగ కులస్తులు పెద్ద ఎత్తున తరలివెళ్లి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మద్దిలేటి, నాగేశ్,వీరాంజనేయులు, రాజు, అయ్యప్ప, రంగడు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రద్దు

గుత్తి: గుత్తి మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరగాల్సిన కౌన్సిల్ సమావేశాన్ని రద్దు చేస్తున్నట్లు కమిషనర్ జబ్బార్‌మియా పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని రద్దు చేశామన్నారు. ఇక ఈ నెలలో సమావేశం ఉండదన్నారు. మున్సిపల్ అధికారులు, పాలకవర్గం , కౌన్సిలర్లు సహకరించాలని ఆయన కోరారు.

ఉపాధి భద్రత కల్పించాలి


కరపత్రాలను విడుదల చేస్తున్న క్షౌర వృత్తిదారుల సంఘం నాయకులు

గుంతకల్లుటౌన్: కార్పొరేట్ సెలూన్‌షాపులను తొలగించి క్షౌర వృత్తిదారులకు ఉపాధి భద్రత కల్పించాలని ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కోశాధికారి బ్రహ్మ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ నెల 30న అంబేద్కర్‌భవన్‌లో నిర్వహించే సదస్సుకు సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేశారు. పట్టణంలో ఏర్పాటు చేసిన కార్పొరేట్ సెలూన్ షాపులను తొలగించే వరకు భవిష్యత్తులో చేపట్టబోయే ఉద్యమాల కార్యాచరణను రూపొందించేందుకు సదస్సు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శంకర్, అజయ్, బాల, నీలాకుమార్, చరణ్, బాలకృష్ణ, అంజి, వాసు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో ఆదివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుని ఇద్దరు గాయపడ్డారు. వివరాలు .. బైక్ అదుపు తప్పి బోల్తా పడి ప్రమాదం జరిగింది. ఘటనలో పట్టణానికి చెందిన మారుతి, మధు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించారు.

'గ్రీవెన్స్'కు హాజరుకండి

యల్లనూరు: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించే ఫిర్యాదుల విభాగానికి అన్ని శాఖల అధికారులు అర్జీదారులకు అంటుబాటులో ఉండాలని తహసీల్దారు రాము సూచించారు. ఉదయం 10.30గంటలకు మండలస్థాయి అధికారులు హాజరుకావాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏవైనా సమస్యలుంటే అర్జీలు ఇవ్వాలన్నారు.

పశు వైద్యశాలలో నీటి సమస్య



నీటి సదుపాయం లేని పశు వైద్యశాల

గుత్తి: పట్టణంలోని గుత్తి ఆర్ఎస్ రోడ్డులో ఉన్న పశువైద్య శాలలో నీటి సదుపాయం లేక పశు వైద్యాధికారులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. డబ్బులు పెట్టి నీటిని కొనుగోలు చేస్తున్నారు. ఆరు నెలల క్రితం పశువైద్య శాలలో ఉన్న కొళాయి కనెక్షన్‌ను మున్సిపల్ అధికారులు కట్ చేశారు. ఈ విషయంపై పశువైద్యాధికారులు మున్సిపల్ అధికారులను ప్రశ్నిస్తే అక్రమంగా కొళాయిని వేసుకున్నారని, అందుకే కట్ చేశామని సమాధానమిచ్చారు. దీంతో పశువులకు ఆపరేషన్ చేసే సమయంలో నీటి కోసం తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని వెటర్నరీ ఏడీ భారతి మున్సిపల్ అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా పశువైద్య శాలకు కొళాయి కనెక్షన్ పునరుద్ధరించాలని ఏడీ కోరారు.

'డిజిటల్ బుక్'తో కార్యకర్తలకు రక్షణ



పెద్దవడుగూరులో డిజిటల్ బుక్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు, యాడికిలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వెంకటరామిరెడ్డి, లక్ష్మీదేవి, సంజీవరాయుడు తదితరులు

యాడికి: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో రూపొందించిన డిజిటల్ బుక్ ..వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు , సోషల్ మీడియా కార్యకర్తలకు రక్షణ కవచంగా నిలుస్తుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వెంకటరామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి, మండల కన్వీనర్ సంజీవరాయుడు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశాల మేరకు జగనన్న క్యూఆర్ కోడ్‌ను పార్టీ నేతలతో కలిసి వారు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ అన్యాయానికి గురవుతున్న పార్టీ కార్యకర్తలకు భరోసా కల్పించేందుకు డిజిటల్ బుక్ అందుబాటులోకి తెచ్చారన్నారు. ఇబ్బందులు పెట్టే వారి పేర్లు డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు హరీష్ రెడ్డి, కొమ్మా ప్రసాద్ రెడ్డి, రంగ, సాంబ శివుడు, మోపిరెడ్డి, శివయ్య, భోగాల కట్ట భాస్కర్ రెడ్డి, వేలూరు జగదీస్ చౌదరి, రామాంజనేయులు, లక్ష్మి రెడ్డి, కొండారెడ్డి, రామకృష్ణ, నాగార్జున, చౌడయ్య, కె. రామకృష్ణ, గోవింద్, రామకృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇబ్బందులు పడుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉండాలని పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ ఆవిష్కరించారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి, నాయకులు శేషారెడ్డి, భీమునిపల్లి రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో డిజిటల్ బుక్ కరపత్రాలను విడుదల చేశారు. కార్యకర్తలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా కోడ్ స్కాన్ చేసి పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో బ్రహ్మానందరెడ్డి, చిన్నవడుగూరు శేఖర్, మల్లేనిపల్లి మురళీ, బాబు, సుబ్బారెడ్డి, రామచంద్రారెడ్డి, సాంబశివుడు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

శింగనమలలో నేడు డిజిటల్ బుక్ ఆవిష్కరణ

గార్లదిన్నె: బుక్కరాయసముద్రంలోని శింగనమల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయం సమన్వయకర్త సాకే శైలజానాథ్ ఆధ్వర్యంలో సోమవారం డిజిటల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ ఎల్లారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు డిజిటల్ బుక్ ఆవిష్కరించి, జనం కోసం జగన్ అనే కార్యక్రమం నిర్వహిస్తారని, మండలంలోని నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు.

'కోటంక'లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకులు రామాచార్యులు అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సౌకార్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

'సెలవుల్లో పాఠశాలలు నిర్వహిస్తే చర్యలు'

యాడికి: దసరా సెలవుల్లో ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎంఈఓ కాశెప్ప హెచ్చరించారు. ఆదివారం అయన మాట్లాడతతూ పదో తరగతి విద్యార్థుల కోసమంటూ ప్రత్యేక తరగతులు నిర్వహించకూడదన్నారు. పిల్లల తల్లిదండ్రులు సైతం సహకరించాలని, ఎవరైనా ప్రత్యేక తరగతుల పేరిట పాఠశాలకు విద్యార్థులు హాజరు కావాలని చెబితే ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

అథ్లెటిక్స్‌లో విద్యార్థిని ప్రతిభ


వర్షిత

గుంతకల్లుటౌన్: గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మండలంలోని నక్కనదొడ్డి గ్రామానికి చెందిన వర్షిత అనే విద్యార్థిని ప్రతిభ కనబరిచింది. అండర్–16 విభాగంలో 600 మీటర్ల పరుగుపందెం పోటీల్లో తృతీయస్థానంలో నిలిచి మెడల్‌ను సాధించినట్లు కోచ్ సంజీవ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

తక్కువ ధరకు దసరా కిట్


దసరా కిట్లు విక్రయిస్తున్న వెలుగు సిబ్బంది

శింగనమల(నార్పల): నార్పల వెలుగు మహిళ మార్టు అధికారులు తక్కువ ధరతో దసరా కిట్లను విక్రయిస్తున్నారు. ఆదివారం దసరా కిట్ విక్రయాలను డీపీఎం గంగాధర్ ప్రారంభించారు. దసరా కిట్‌లో 11 రకాల వస్తువులు ఉంచామని తెలిపారు. ఇందులో గోధమ పిండి, కంది బేడలు, సెనగ బుడలు, బెల్లం కిలో చొప్పున, ఓలిగ రవ్వ, మైదా పిండి, యాలక్కలు, అప్పడాలు, పామాయిల్, రసం పొడి, ఓలిగ పేపర్ కలిపి రూ.500కు విక్రయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం తిప్పక్క, సిబ్బంది, మహిళ మార్టు సిబ్బంది పాల్గొన్నారు.

బాలకృష్ణా.. నోరు అదుపులో పెట్టుకో


ఫయాజ్‌బాషా

తాడిపత్రిటౌన్: బాలకృష్ణ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడితే గౌరవంగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఫయాజ్‌బాషా ధ్వజమెత్తారు. అసెంబ్లీ సాక్షిగా చిరంజీవి, వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై బాలకృష్ణ చేసిన వాఖ్యలను ఆయన తప్పుపట్టారు. ఈ సందర్భంగా ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మెంటల్ సర్టిఫికెట్ ఉన్న బాలక్రిష్ణను చట్ట సభల్లోకి రానివ్వడమే తప్పన్నారు. మెంటల్ సర్టిఫికెట్ ఇచ్చిన అప్పటి వైద్యులు కూడా ఆయనకు మునుముందు చికిత్స అవసరం అని తెలిపారని గుర్తు చేశారు. వెంటనే బాలక్రిష్ణను మెంటల్ ఆసుపత్రిలో చేర్చి చికిత్సలు అందించాలన్నారు. అన్న చిరంజీవిపై అనుచిత వాఖ్యలు చేసినా డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ గానీ జన సైనికులు గానీ స్పందించక పోవడం దారుణమన్నారు.

చర్చిల్లో వృద్ధుల ఆరాధనోత్సవం


పామిడిలోని సీఎస్ఐ చర్చిలో ప్రార్థన చేస్తున్న సభ్యులు

పామిడి: మండలంలోని అన్ని చర్చిల్లో ఆదివారం వృద్ధుల ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన ఆరాధన కార్యక్రమంలో పాస్టరమ్మ సువర్ణమ్మ మాట్లాడారు. వృద్ధుల పట్ల ప్రేమ, గౌరవం కలిగి ఉండాలన్నారు. వృద్ధులైన తల్లిదండ్రులను సన్మానించువారు దీర్ఘాయుష్మంతులు అవుతారన్నారు. క్రీస్తుతోనే నిత్యజీవం ప్రాప్తిస్తుందన్నారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు, వీరయ్య, జయరాజు, రత్నరాజు, బుజ్జిబాబు, హోసన్నా, దేవదాసు, కరుణాకర్, రాజు, వరప్రసాద్, రజని, మంజులమ్మ, చంద్రకళ, శాంతమ్మ, మాణిక్యమ్మ, డాక్టర్ కమల, సుశీలమ్మ, వాణి, లత, అంజలి, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలన మోసపూరితం


చంద్రబాబు మోసాలను వివరిస్తున్న మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి


బుక్కరాయసముద్రం: చంద్రబాబు పాలన మోసపూరితమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గం సమన్వయకర్త శైలజానాథ్ ఆదేశాల మేరకు ఆదివారం బీకేఎస్ మండల కేంద్రంలోని కాలనీల్లో ఇంటింటికీ చంద్రబాబు మెసం–మోసపూరిత హామీల రీకాలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికలకు ముందు ప్రజలకు ఓట్లు వేయాలని నమ్మించి వాగ్దానాలు చేశారన్నారు. అధికారంలోకి వచ్చాక ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. మోసం చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. అనంతరం చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పార్వతి, నాయకులు పూల నారాయణస్వామి, ముత్యాలశీన, చికెన్ నారాయణస్వామి, పూల రంగా, అన్నేరి ఆది, బుల్లే రాజా, ఈశ్వరయ్య, సత్తి, ఆదినారాయణ, పవన్, అంజి, సుబ్బిరెడ్డి, కేశవరెడ్డి, పూల రవి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి


గుంతకల్లులో భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జగదీష్ తదితరులు

గుంతకల్లుటౌన్/గుత్తి: గుంతకల్లులోని సీపీఐ కార్యాలయంలో భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భగత్‌సింగ్ పోరాటపటిమను, త్యాగనిరతిని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్, జిల్లా సమితి సభ్యుడు మహేష్, పట్టణ కార్యదర్శి గోపినాథ్, సహాయ కార్యదర్శి ఎం డీ.గౌస్, ఏఐఎస్ఎఫ్ నాయకులు వెంకటనాయక్, అఖిల్, మధు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్‌లోని భగత్‌సింగ్ విగ్రహానికి డీవైఎఫ్ఐ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే గుత్తి పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డులో ఉన్న భగత్ సింగ్ విగ్రహం వద్ద ఆదివారం జేవీవీ, భగత్ సింగ్ కమిటీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జేవీవీ జిల్లా అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, నాయకులు దేశాయి నాగరాజు, శ్రీ ధర్ గౌడ్, రామాంజనేయులు, భగత్ సింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


గుత్తిలో గవ్వల అలంకారంలో వాసవీ మాత


యాడికిలో భవానీదేవిగా పెద్దమ్మ అమ్మవారు



నార్పలలో పూజలందుకుంటున్న ఉద్దిబావి దుర్గాదేవి

ఆదిపరాశక్తీ పాహిమాం..

తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఏడో రోజు ఆదివారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. – సాక్షి బృందం


బుగ్గలో కాళరాత్రి అలంకరణలో అమ్మవారు


గుంతకల్లులో స్కందమాతగా వాసవీ దేవి


సేవాఘడ్‌లో మహాచండీగా మాతా జగదాంబ


పెద్దవడుగూరులో మహాలక్ష్మీదేవిగా అమ్మవారు


పామిడిలో వాసవీ కన్యకా పరమేశ్వరిమాత


కల్లూరులో మధుర మీనాక్షి అలంకరణలో అమ్మవారు

నిత్యావసర సరుకుల పంపిణీ


బాధితుడికి సరుకులు అందజేస్తున్న నాయకులు

పుట్లూరు: మండల కేంద్రానికి చెందిన సీపీఐ మండల సమితి సభ్యుడు దావీదుకు ఆదివారం ఆపార్టీ మండల కమిటీ సభ్యులు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సీపీఐ నాయకులు మాట్లాడుతూ గత నెల 26న తాడిపత్రి ప్రాంతంలో బండల ఫ్యాక్టరీలో పని ముగించుకొని ద్విచక్రవాహనంలో ఇంటికి వస్తుండగా ఎదురుగా మరొక ద్విచక్రవాహనం ఢీ కొనడంతో దావీదుకు కుడి చెయ్యి, కాలు విరిగిందన్నారు. దీంతో బాధిత కుటుంబానికి నాలుగు ప్యాకెట్ల బియ్యం, ఐదు కేజీల గోధుమ పిండి, ఐదు కిలోల వంట నూనె, కోడిగుడ్లు, రెండు కిలోల ఉప్మా రవ్వ, బొరుగుల మూట అందించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కమిటీ సభ్యులు పెద్దయ్య, రాజు, బాలు, పెద్దన్న, ఓబులపతి, నారాయణ, బాల రాముడు, బాల కొండయ్య, వెంకటశివ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

శింగనమల: శింగనమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993–94 పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో సరస్వతి విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం ఏర్పాటైన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అప్పటి జ్ఞాపకాలను పంచుకున్నారు. అప్పటి గురువులు మనోహరి దేవి, నాందేవ్, పెద్దయ్య, జాఫర్ వలి, ఆదినారాయణమ్మ, బంగారప్ప, వి.బి. ఆదినారాయణను పూర్వ విద్యార్థులు సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి తమ సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

పేరుకుపోయిన అపరిశుభ్రత



జంగాల కాలనీలో పేరుకుపోయిన చెత్తా చెదారం

గుత్తి: పట్టణంలోని జంగాల కాలనీలో చెత్తా చెదారం పేరుకుపోయింది. ఏకంగా చెత్త దిబ్బలా మారిపోయింది. చెత్త కుప్పలు, కుప్పలుగా పేరుకుపోయినా శానిటేషన్ వర్కర్లు తొలగించడం లేదు. దీంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసన భరించలేకున్నామని వెంటనే చెత్తా చెదారం తొలగించి శుభ్రం చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.